కుండపోత వర్షం

కురుపాంలో కురుస్తున్న భారీ వర్షం

ప్రజాశక్తి - కురుపాం

మండలంతో పాటు పరిసర గిరిజన ప్రాంతాల్లో ఆదివారం రెండు గంటల పాటు ఎడతెరపి లేకుండా కురిసిన వర్షం రైతులకు ఎంతో ఊరట ఇచ్చింది. పంట పొలాల్లో నీరు చేరుకోగా, నారుమళ్లకు సిద్ధం చేసుకున్న భూముల్లో విత్తనాలు వేసుకోవడానికి ఎదురుచూస్తున్న రైతన్నలకు ఈ వర్షం ఎంతగానో ఉపయోగపడుతుంది. నైరుతి రుతుపవనాల ప్రభావంతో వర్షాలు కురుస్తున్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలియజేయడం రైతులకు ఊరట లభించింది. అలాగే సీతంపేటలోనూ వర్షం కురిసింది.

విద్యుత్తు వినియోగదారులపై దొంగదెబ్బ

- కరెంటు ఛార్జీ కన్నా అదనపు భారాలే ఎక్కువ
- భరించలేక పోతున్నామంటున్న ప్రజానీకం



విజయనగరంలోని తోటపాలేనికి చెందిన కృష్ణవేణి కూరగాయల బండి నడుపుతూ కుటుంబాన్ని నెట్టుకొస్తోంది. అదే ప్రాంతంలో అద్దె ఇంటిలో నివాసం ఉంటోంది. గతంలో రూ.250లోపు మాత్రమే కరెంటు బిల్లు వచ్చేది. మేలో రూ.428 బిల్లురావడంతో అవాక్కైన కృష్ణవేణి కరెంటు ఆఫీసుకు వెళ్లి అడగడంతో అసలు కన్నా కొసరు ఛార్జీలే ఎక్కువని తేలడంతో అవాక్కైంది. కృష్ణవేణి కరెంటు బిల్లును పరిశీలిస్తే... మొత్తం 110 యూనిట్ల కరెంటు ఛార్జీ కేవలం రూ.349 విధించారు. ఆపై కస్టమర్ ఛార్జీ రూ.10, డిమాండ్ ఛార్జీ రూ.45, ఇడి ఛార్జీ రూ.6, ఎఫ్‌పిపిఎ ఛార్జీ రూ.21, ట్రూ అప్ ఛార్జీ రూ. 14, ఐఎస్‌డి, టిడిఎస్ ఎరియర్స్ రూ.17 చొప్పన విధించారు. ఇదే విషయాన్ని విద్యుత్తు కస్టమర్ సర్వీస్ సెంటర్ సిబ్బంది చెప్పడంతో కృష్ణవేణి ఆగ్రహం కట్టలు తెంచుకుంది. మునుపెన్నడూ ఇంత మొత్తంలో కరెంటు బిల్లు రాలేదని, అదనపు ఛార్జీల వల్లే ఇంతలా వచ్చిందని ఆవేదన చేసింది. గతంలో ట్రూ అప్ ఛార్జీ, ఎరియర్స్ తదితరాలు ఇంత మొత్తంలో లేవంటూ వాదించినా ఫలితం లేకపోయింది.

తోటపాలెం ప్రాంతంలోని ముచ్చెరువుగట్టుకు చెందిన కిలారి మణి ఇంటి కరెంటు బిల్లు గతంలో రూ.500లోపు వచ్చేది. మే నెల బిల్లు రూ.1225 రావడంతో ఆశ్చర్యపోయింది. ఒక ఫ్యాను ఒక లైటుకు ఇంత మొత్తంలో ఎలా బిల్లు ఇస్తారంటూ సిబ్బందిని ప్రశ్నించగా 'విద్యుత్తు ఛార్జీలు పెరిగాయమ్మా' అంటూ సెలవిచ్చారు.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

కేవలం ఇది కృష్ణవేణి, మణిపై పడిన విద్యుత్తు భారమే కాదు. విద్యుత్తు వినియోగ ఛార్జీలతోపాటు రకరకాల రూపాల్లో ప్రభుత్వం విద్యుత్తు ఛార్జీలు పెంచేసింది. ఇప్పటికే 11 నెలల పాటు వినియోగదారులు చెల్లించారు. మరో 25 నెలలపాటు ఇంకా చెల్లించాల్సి ఉంది. ఇది చాలదన్నట్టుగా 2021-22 ఆర్థిక సంవత్సరంలో వినియోగించిన విద్యుత్తు బిల్లులకు చెల్లించిన మొత్తం సరిపోలేదంటూ తాజాగా మరోసారి 20పైసలు చొప్పున సర్దుబాటు ఛార్జీలు మోపింది. దీంతో పాత, కొత్త సర్దుబాటు ఛార్జీలు కలిపి 40 పైసలు అవుతోంది. దీన్ని భరించడమే అత్యంత కష్టతరంగా ఉన్న పరిస్థితుల్లో సర్దుబాటు ఛార్జీలు ఇక నుంచి మరుసటి నెలలోనే వసూలు చేయాలన్న కేంద్ర ప్రభుత్వ ఆదేశాలను రాష్ట్ర ప్రభుత్వం తూచ తప్పకుండా పాటిస్తోంది. ఇందులో భాగంగానే మోడీ ఆదేశాలే తడువుగా జగన్ సర్కారు ఏప్రిల్‌లో చెల్లించిన డబ్బులు సరిపోలేదని మరో 40పైసలు వసూళ్లకు సిద్ధపడింది. ఈ లెక్కన కేవలం సర్దుబాటు ఛార్జీ రూపంలోనే 80 పైసలు భారం పడుతోంది. దీనికితోడు నెలవారీ వినియోగపు బిల్లు, ఫిక్స్‌డ్ ఛార్జీ, కస్టమర్ ఛార్జీ, ట్రూ అప్ ఛార్జీ తదితరాల రూపంలో అధిక మొత్తంలో బిల్లులు విధించడంతో సామాన్య కుటుంబాల్లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం, అసహనం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్తు వినియోగదారులను ప్రభుత్వం దొంగదెబ్బ తీస్తోందని విమర్శిస్తున్నారు.

ఏప్రిల్‌లో రూ.500.. మేలో రూ.974

ఏప్రిల్ వినియోగానికి సంబంధించి విద్యుత్తు బిల్లు రూ.500 వచ్చింది. ఇప్పటి వరకు రూ.600కు మించి బిల్లు ఎప్పుడూ రాలేదు. మే నెలకు సంబంధించి బిల్లు రూ.974 రావడంతో గుండె గుబేలుమంది. కాయా కష్టం చేసుకుని బతికేటోళ్లం. ఇంతేసి మొత్తం విద్యుత్తు బిల్లుకే కట్టాలంటే కుటుంబాన్ని ఎలా నెట్టుకురాగలం. వైసిపియే కాదు... ఏ ప్రభుత్వానికైనా ఇటువంటి చర్యలు సరికాదు.

- దిబ్బిడి దేవి, బూడి వీధి, పూసపాటిరేగ

ఫ్యాను, లైటుకు రూ.500 బిల్లా?

కూలి దొరికితే తప్ప కూడు దొరకని పరిస్థితి మాది. అందువల్ల ఉదయం నుంచి రాత్రి వరకు ఇంట్లో ఉండే పరిస్థితి లేదు. కేవలం రాత్రి పూట మాత్రమే లైటు వేస్తాం. నిద్రపోయే సమయంలో మాత్రమే ఫ్యాను వేస్తాం. మాకు కూడా రూ.500 బిల్లు వచ్చింది. ఇంతకు ముందు ఇంత మొత్తంలో రాలేదు. ఒకరోజు కష్టమంతా కరెంటు బిల్లుకే సరిపోకపోతే కూడు, గుడ్డ, పిల్లల చదువులు, ఇంటి అద్దెల పరిస్థితి ఏమిటి? వైసిపి అధికారంలోకి వచ్చాక పరిస్థితి చాలా ఘోరంగా ఉంది.

- నాలి గుంపుస్వామి, పూజారిగూడ, కొమరాడ మండలం

సభావేదికను పరిశీలిస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర, జెడ్‌పి చైర్మన్ శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు, కలెక్టర్, అధికారులు

సిఎం పర్యటన ఖరారు

28న ఉదయం 10.30 గంటలకు బహిరంగసభ

ప్రజాశక్తి - కురుపాం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పార్వతీపురం మన్యం జిల్లాలోని కురుపాంలో పర్యటన ఖరారైంది. ఈనెల 28న ఉదయం 9,25 నిమిషాలకు విశాఖపట్నం ఎయిర్‌పోర్టు నుండి బయలుదేరి 10గంటలకు చినమేరంగి పాలిటెక్నిక్ మైదానానికి హెలీకాప్టర్‌లో చేరుకుంటున్నారు. అక్కడ 10నిమిషాల పాటు స్థానిక నాయకులతో ముఖాముఖి అవుతారు. తొలుత సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలిస్తారు. అనంతరం 10.30గంటలకు కురుపాంలో ఏర్పాటు చేసిన బహిరంగసభా ప్రాంగనానికి చేరుకుంటారు. 10.35గంటల నుంచి 12.15వరకు బహిరంగసభ జరుగుతుంది. ఇందులో ముఖ్యమంత్రి ప్రసంగంతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు మాట్లాడారు. మధ్యాహ్నం 12.25 గంటల నుంచి 12.55 వరకు స్థానిక నాయకులతో చర్చిస్తారు. అనంతరం మధ్యాహ్నం 1గంటకు బయలుదేరుతారు.

సిఎం మొదటిసారి జిల్లాకు రాక

ఉపముఖ్యమంత్రి రాజన్నదొర

ముఖ్యమంత్రిగా జగన్మోహన్‌రెడ్డి సృష్టించి జిల్లాకు మొదటిసారిగా రావడం సంతోషదాయకంగా ఉందని ఉప ముఖ్యమంత్రి పీడక రాజన్న దొర అన్నారు. ఈనెల 28న ముఖ్యమంత్రి అమ్మఒడి కార్యక్రమంలో పాల్గొనడానికి కురుపాం వస్తున్న నేపథ్యంలో ఆదివారం సభా స్థలాన్ని, వాహనాల పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ విద్యారంగానికి సిఎం అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. అందులో భాగంగా అమ్మ ఒడి కార్యక్రమం ద్వారా రూ.15 వేలు ప్రతి విద్యార్థి తల్లి అకౌంటు వేస్తూ, నాడు నేడు ద్వారా పాఠశాలల రూపు రేఖలు మార్చి కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా మార్చుతున్నారన్నారు. గిరిజన విద్యార్థుల ఉన్నత చదువుల కోసం కురుపాం కేంద్రంగా ఇంజనీరింగ్ కళాశాల నిర్మించడం హర్షించదగ్గ విషయమన్నారు.

అనంతరం అధికారులతో మాట్లాడుతూ జిల్లాకు మొదటిసారి ముఖ్యమంత్రి రానున్న నేపథ్యంలో పెద్ద ఎత్తున ప్రజలు వస్తున్నారని, అందుకు తగట్టుగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. సభకు వచ్చే ప్రజలకు తాగునీరు, మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. అనంతరం చినమేరంగి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో హెలీప్యాడ్‌కు సిద్ధం చేసే పనులను పరిశీలించారు.

పరిశీలనలో జెడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ముఖ్యమంత్రి కార్యక్రమ సమన్వయకర్త తలశిల రఘురాం, ఎమ్మెల్యేలు పాముల పుష్పశ్రీవాణి, అలజంగి జోగారావు, టిడ్కో ఛైర్మన్ ప్రసన్నకుమార్, వైసిపి జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజు, కలెక్టర్ నిశాంత్ కుమార్, ఎస్పీ విక్రాంత్ పాటిల్, జిల్లా, మండల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన కరపత్రాలను విడుదల చేస్తున్న యూనియన్ నాయకులు

మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్ వై నాయుడు డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల జిల్లా స్థాయి సమావేశం ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఎలాంటి షరతులు లేకుండా మున్సిపల్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రభుత్వ తీరుకు నిరసనగా రాష్ట్ర వ్యాపిత నిరసనలో భాగంగా జిల్లాలో పోరాట కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా జులై 5న విశాఖపట్నంలో జరగనున్న ఉత్తరాంధ్ర జిల్లాల ప్రాంతీయ సదస్సు అనంతరం ఎమ్మెల్యేలు, మంత్రులకు వినతి పత్రాలు సమర్పణ, 20న మున్సిపల్ కార్యాలయాల ముట్టడి, 28, 29 తేదీల్లో అన్ని పట్టణ కేంద్రాల్లో దీక్షలు, ఆగస్టు 1న కలెక్టరేట్ ముట్టడి, 17న చలో విజయవాడ తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అప్పటికే ప్రభుత్వం స్పందించకపోతే అన్ని మున్సిపాల్టీల్లో మున్సిపల్ కార్మికులు నిరవధిక సమ్మె చేయనున్నట్లు హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ జిల్లా నాయకులు పడాల భాస్కరరావు, పడాల వేణు, నాగవంశం మల్లేష్, తుపాకుల వెంకట్రావు, తుపాకుల రాముడు, చింతల సంజీవి తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్లకు, గృహసారధులకు అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

'జగనన్న సురక్ష'పై అవగాహన

ప్రజాశక్తి - సాలూరు

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న సురక్ష కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర కోరారు. ఆదివారం సాయంత్రం తన నివాసంలో నియోజకవర్గ స్థాయి నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 29నుంచి జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభిస్తామని తెలిపారు. మొదటిరోజు మున్సిపాలిటీలో ప్రారంభించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సంక్షేమ పథకాలకు అర్హులై వుండి అందని వారిని గుర్తించి దరఖాస్తులు స్వీకరించాలని చెప్పారు. దరఖాస్తుదారులకు అవసరమైన ధ్రువపత్రాలు వెంటనే మంజూరుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా పట్టణంతో పాటు నాలుగు మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రజల మధ్య వుండాలన్నారు. కుల, ఆదాయం, ఇతర ధ్రువపత్రాల మంజూరు, ఇతర సేవలు సదస్సుల్లోనే అందేలా కార్యక్రమం రూపొందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్‌పర్సన్ దండి అనంతకుమారి, వైసిపి సీనియర్ నాయకులు జర్జాపు సూరిబాబు, పాచిపెంట ఎంపిపి బి.ప్రమీల, సాలూరు వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, మండల జెసిఎస్ కన్వీనర్ కె.త్రినాధనాయుడు, మున్సిపల్ వైస్‌చైర్మన్ వంగపండు అప్పలనాయుడు కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

సీతానగరం : జగనన్న సురక్ష కార్యక్రమం అవగాహనలో భాగంగా అంటిపేట సచివాలయం పరిధిలో గలవాలంటీర్లకు, గృహసారధులకు స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆదివారం దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన ఈ కార్యక్రమం జులై1 నుంచి ప్రారంభం కానున్న దృష్ట్యా ముందుగా ఆయా సచివాల పరిధిలో వాలంటీర్లు, గహ సారథులు, సచివాలయం కన్వీనర్లు అంతా కలిసి ఇంటింటి సందర్శన చేసి జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఏమైనా సమస్యలుంటే అడిగి తెలుసుకుని వాటిని రిజిస్టర్ చేయించి ప్రభుత్వం అందించే 11 సేవల్లో ఏదైనా వారికి అవసరం ఉందా లేదా అని అడిగి తెలుసుకోవాలన్నారు. గుర్తించిన ఆయా సమస్యలకు వారం రోజుల వ్యవధిలో అన్నింటినీ పరిష్కరిస్తామని ప్రజలకు తెలిపి సమస్యలు చెప్పిన వారికి టోకెన్ అందజేయాలని తెలిపారు. ప్రజలకు ఎంతగానో ఉపయోగపడే ఈ కార్యక్రమాన్ని మొక్కు బడిగా నిర్వహించరాదని ఆదేశించారు. కార్యక్రమంలో మండల ప్రజా ప్రతినిధులు, వైసిపి సీనియర్ నాయకులు, గృహసారధులు, సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గిరిజన సమస్యలపై సిఎంను అడుగుదాం రండి

గిరిజన సంఘం పిలుపు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

రాష్ట్ర ముఖ్య మంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఈ నెల 28న కురుపాం వస్తున్న సందర్భంగా మన్యం జిల్లా గిరిజన సమస్యలపై దరఖాస్తు ఇచ్చి అడుగుదాం రండి అని గిరిజన సంఘం జిల్లా నాయుకులు ఆదివారం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు మండంగి రమణ, అధ్యక్ష కార్యదర్శులు సీదరపు అప్పారావు, ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ బోయ, వాల్మీకిలను ఎస్టీ జాబితాలో చేర్చి గిరిజనులకు రిజర్వేషన్ లేకుండా చూస్తున్నారని వెంటనే ఆ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని కోరారు. జిఒ 3ను కొనసాగించాలని, గిరిజన ప్రాంతంలో విద్యుత్ హైడ్రాలిక్ ప్రాజెక్టులను అదానీ కంపెనీకి ఇచ్చి గిరిజనుల భూములు లాక్కోవడానికి చూస్తున్నారని, అభివృద్ధి పేరుతో కొండలను మైనింగ్‌కు ఇచ్చి గిరిజనులకు ఉనికే లేకుండా చేయడానికి ప్రయత్నిస్తున్నారని అన్నారు. అలాగే గిరిజన ఇంజినీరింగ్ కళాశాలకు భూములిచ్చిన గిరిజనులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలని, అనేక ఏళ్ల నుంచి ఏనుగులు ఈ ప్రాంతంలో తిరుగుతూ 8 మంది ప్రాణాలు తీశాయని, రైతులు పంటలకు తీవ్ర నష్టం చేస్తున్నాయని, ఏనుగులు వెంటనే అడవికి తరలించాలని అని అన్నారు,. గిరిజన ప్రాంతంలో అనేక గ్రామాలకు రోడ్లు వేయాలని, ఏజన్సీలోని హాస్పటళ్లలో సిబ్బంది కొరత, మందుల కొరత పరిష్కరించాలని కోరుతూ సిఎంకు వినతిని చ్చేందుకు గిరిజనులంతా కురుపాం కదలి రావాలని పిలుపునిచ్చారు.

సైన్స్ అవార్డుల రద్దు..

శాస్త్రీయతను నిలువరించేందుకే

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

శాస్త్రీయ దృక్పథాన్ని నిలువరించేందుకే కేంద్రం ప్రభుత్వం సైన్స్ అవార్డులను రద్దు చేసిందని జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యాన ఆదివారం జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశం అభిప్రాయ పడింది. ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకు పోరాడాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా జులై 2న విజయనగరంలోని మహాకవి గురజాడ ఇంటి నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు సైన్స్ వాక్ నిర్వహించాలని అభిప్రాయ పడింది. ఇందులో అభ్యుదయవాదులు, ప్రజా, ఉద్యోగ, విద్యార్థి సంఘాలు, మేధావులు, వైద్యులను భాగస్వామ్యం చేయాలని నిర్ణయించింది. జన విజ్ఞాన వేదిక నాయకులు ఎంవిఎన్ వెంకటరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఐఎంఎ రాష్ట్ర పూర్వ అధ్యక్షులు డాక్టర్ వివిఎస్ ప్రసాద్ మాట్లాడుతూ సైన్స్ అవార్డుల రద్దు చేయడమంటే శాస్త్రీయ దృక్పథాన్ని దెబ్బతీయడమేనని అన్నారు. వైద్యరంగంలోనూ కేంద్ర ప్రభుత్వం అశాస్త్రీయమైన ఆలోచనలు ప్రవేశపెడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయుర్వేదం, హోమియో, అల్లోపతి విభాగాలను కిచిడీ వైద్యంగా మార్చేయడమంటే ప్రజల ప్రాణాలకు భద్రత లేకుండా చేయడమేనన్నారు. మానవాళి మనుగడలో విప్లవాత్మకమైన మార్పులను గుర్తించిన డార్విన్ సిద్ధాంతం రద్దు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలు

ఏజెన్సీలో మలేరియా నిర్మూలనకు అవగాహన

గర్భిణుల పట్ల అప్రమత్తం

ప్రజాశక్తితో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి బగాది జగన్నాథరావుతో ముఖాముఖి

రానున్నది సీజనల్ వ్యాధుల కాలం కావడంతో వాటి నివారణకు ఇప్పటి నుంచే ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి బగాది జగన్నాథరావు అన్నారు. ముఖ్యంగా మలేరియా, డెంగీ వ్యాధుల బారినపడకుండా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే మలేరియా నివారణ కోసం గ్రామాల్లోనూ, పాఠశాలల్లో మలాథియన్ పిచికారీ, దోమతెర పంపిణీ వంటి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అలాగే మాత, శిశుమరణాల నివారణకు ముందుస్తుగా హైరిస్క్ గర్భిణులను గుర్తించి వారిపట్ల ఎప్పటికప్పుడు అప్రత్తంగా ఉండాలని సిబ్బందికి సూచిస్తున్నాం. మిగిలిన గర్భిణులకు కూడా ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందజేస్తున్నామన్నారు. అలాగే ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాలకు ప్రోత్సాహిస్తున్నామని చెప్పారు. వీటితో పాటు ప్రజల ఆరోగ్యంపట్ల జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ చేపడుతున్న చర్యలను ఆయన 'ప్రజాశక్తి' ముఖాముఖికి వివరించారు. వివరాలు ఆయన మాటల్లోనే.... - ప్రజాశక్తి కలెక్టరేట్

జిల్లాలో మలేరియా ఎక్కువగా ఉండడానికి గల కారణాలేమిటి?

మన్యం ప్రాంతంలో మలేరియా ముందు నుండి ఎక్కువగానే ఉంది. దీనికి ప్రధాన కారణం మలేరియా కారణమైన ప్రోటోజోవాకు అనుకూలమైన వాతావరణం ఉండడంతో జిల్లాలో మలేరియా కేసులు ఎక్కువగా నమోదు అవుతుంది.

ఇప్పటి వరకు జిల్లాలో ఎన్ని మలేరియా, డెంగీ కేసులు నమోదయ్యాయి?

జిల్లాలో నేటి వరకు 190 మలేరియా కేసులు, 86 డెంగీ కేసులు నమోదయ్యాయి. ఆ కేసులకు సంబంధించి మందులు, వైద్యం ఆరోగ్య శాఖ ద్వారా ఏ ఒక్కరికీ ఇబ్బంది కలగకుండా అందిస్తున్నాం. ఈనెలను యాంటీ మలేరియా నెలగానూ, జూలైని యాంటీ డెంగీ నెలగా పరిగణించి ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం.

మలేరియా వ్యాప్తి నివారణకు తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

మలేరియా వ్యాప్తిని నివారించడానికి ఇప్పటికే స్ప్రేయింగ్ మొదటి దశలో భాగంగా జిల్లాలో మొత్తం 285 గ్రామాల్లోనూ, పాఠశాలలో స్ప్రేయింగ్ చేశాం. అలాగే మలేరియాను మరింతగా నివారించేందుకు రెండో దశ స్ప్రేయింగ్‌ను జూలై 15 నుండి ఆగస్టు 30 వరకు చేసేందుకు నిర్ణయించడమైనది.

సీజనల్ వ్యాధులపై ప్రజల్లో అవగాహనకు ఎటువంటి కార్యక్రమాలు చేపడుతున్నారు?

మలేరియా, డెంగ్యూ వంటి సీజనల్ వ్యాధులపై అవగాహన కోసం ర్యాలీ నిర్వహించాం. ఫ్రైడే, డ్రైడే వంటి కార్యక్రమాలు నిర్వహించి దోమల వ్యాప్తి అరికట్టి మలేరియాను నివారించేలా ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. అలాగే రెండేళ్ల క్రితం పంపిణీ చేసిన దోమతెరలను ఏ విధంగా ఉపయోగించాలి, వాటిని ఏ విధంగా ఉతికి శుభ్రపరచి భద్రపరచుకోవాలో అవగాహన కల్పిస్తున్నాం.

మలేరియా నిర్ధారణ, వైద్యం గ్రామాల్లో ఏ విధంగా జరుగుతుంది?

గ్రామాల్లో ఆశా కార్యకర్తలు, ఎఎన్ఎంల ద్వారా ఫీవర్ సర్వే చేయిస్తున్నాం. ఎవరికైనా మలేరియా అనే సందేహం వస్తే నమూనాలు సేకరించి విలేజ్ వెల్నెస్ కేంద్రాల్లో, లేదా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద రాపిడ్ టెస్ట్ నిర్వహించి, మలేరియాగా నిర్ధారణ జరిగితే రాడికల్ ట్రీట్మెంట్ అందిస్తున్నాం. ప్రతి వెల్నెస్ కేంద్రం, పిహెచ్‌సిల్లో సీజనల్ వ్యాధులకు సంబంధించిన పరీక్షలు చేయించి తగిన మందులు అందుబాటులో ఉంచడం జరుగుతుంది. అలాగే మలేరియా వ్యాధి వ్యాప్తి చెందకుండా ఉండేందుకు ప్రజలు తమ ఇళ్లలోనూ చుట్టుపక్క, పరిసరాల్లోనూ నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. తద్వారా దోమలు వ్యాప్తిని అరికట్టి మలేరియాను నివారించవచ్చు. అలాగే దోమలు ఇళ్లల్లో ప్రవేశించకుండా కిటికీలు, తలుపులు సాయంత్రం వేళల్లో మూసి ఉంచాలి. చిన్నపిల్లలకు కాళ్లు, చేతులు కప్పి ఉండేలా బట్టలు వేసి దోమలు కుట్టకుండా శరీరంపై నూనె రాసుకోవాలి. ఒకవేళ దోమలు కుట్టినట్లయితే సమీపంలోని ఆరోగ్య కేంద్రానికి వెళ్లి పరీక్షలు చేయించి తగిన మందులను వాడుకోవడం ద్వారా మలేరియాను సామాజిక వ్యాప్తి నుండి దూరం చేయవచ్చు.

ఏజెన్సీ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు అధికంగా వ్యాపిస్తున్న నేపథ్యంలో ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

గిరి శిఖర గ్రామాల్లో సీజనల్ వ్యాధులు అధికంగా వచ్చే అవకాశం ఉండడంతో ఆయా ప్రాంతాల్లో హెల్త్ క్యాంప్ నిర్వహించి తగిన వైద్యం, మందులు అందిస్తున్నాం. అలాగే ప్రతి శుక్రవారం డ్రైడే పాటించడం వల్ల కలిగే ప్రయోజనాలను గిరిజనులకు అర్థమయ్యేలా తెలియజేస్తున్నాం. గిరిజన ప్రాంతాల్లో ఎక్కువగా కేసులు నమోదవుతున్న గ్రామాల్లో దృష్టిని కేంద్రీకరించి తగిన చర్యలు తీసుకుంటున్నాం.

గర్భిణుల పట్ల తీసుకుంటున్న చర్యలేమిటి?

ప్రతి పిహెచ్‌సి పరిధిలో గర్భిణులను ముందుస్తుగానే గుర్తిస్తున్నాం. వారికి ఏ నెలకు ఆనెల పరీక్షలు చేయిస్తున్నాం. ఎవరికైనా రక్తహీనత, ఇతర ఇబ్బందులేమైనా ఉన్నట్టయితే వారికి పోషకాహారం అందించేలా చర్యలు, మందులు అందజేస్తున్నాం. హైరిస్కు గర్భిణులను గుర్తించి, వారిని ముందుగానే ఆస్పత్రులకు తరలించే ప్రసవించే వరకూ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం.

లబ్ధిదారులతో మాట్లాడుతున్న టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్

టిడ్కో లబ్ధిదారులకు అవగాహన

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పట్టణ ప్రజలకు అడ్డాపుశీలలో నిర్మిస్తున్న టిడ్కో గృహ సముదాయాల్లో అందిస్తున్న సదుపాయాలను చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ లబ్ధిదారులకు వివరించారు. గృహ సందర్శన కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆయన టిడ్కో ఇళ్ల సముదాయం వద్దకు వెళ్లి లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణంలో అనుసరిస్తున్న విధానాలు, షీర్ వాల్ టెక్నాలజీ, నాణ్యత ప్రమాణాలు, అందిస్తున్న సదుపాయాల గురించి వివరించారు. సుమారుగా రూ.12 లక్షల విలువైన ఇంటిని ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుందన్నారు. పట్టణంలోని 678 ఇళ్ల సముదాయాన్ని సుమారు రూ.80 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్నామన్నారు. అలాగే 24 గంటలు తాగునీరు, మురుగు నీరు పోయేందుకు ఎస్‌టిపి నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. ఈకార్యక్రమంలో పలువురు లబ్ధిదారులు, అధికారులు పాల్గొన్నారు.

విజేతలు రవికుమార్, సుధీర్‌కుమార్‌ను అభినందిస్తున్న కోచ్ గోపి

షటిల్ టోర్నీలో కురుపాం జట్టు విజయం

ప్రజాశక్తి - కురుపాం

బొబ్బిలిలో గత మూడు రోజులుగా జరిగిన షటిల్ టోర్నీలో కురుపాం జట్టు విజయం సాధించింది. టోర్నీ గెలిచి యువత కురుపాం ఆదివారం రావడంతో షటిల్ కోచ్ చిప్పాడ గోపి టోర్నీలో గెలిచిన యంత్రపల్లి రవికుమార్, ఎడ్ల సుధీర్‌కుమారును అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు ఏడు జిల్లాల నుంచి పాల్గొన్న షటిల్ టోర్నీలో కురుపాం విజయం సాధించడం గర్వించదగ్గ విషయమన్నారు. కురుపాంలో షటిల్ ఆడే యువతకు ఇంకా ముందుందు రాష్ట్రస్థాయిలో ఆడ్డానికి తన వంతు సూచనలు, సలహాలు ఇచ్చేందుకు కృషి చేస్తానన్నారు.

పార్కులో సందడి చేస్తున్న చిన్నారులు

పార్కులో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్క్‌లో పర్యాటకులు సందడి చేశారు. ఆదివారం సెలవు కావడంతో పర్యాటకులు తరలివచ్చారు. పార్కులో ఉన్న అందాలను ఆస్వాదించారు. హ్యాంగింగ్ బ్రిడ్జిపై నడిచి వెళ్లారు. జలవిహారం వద్ద బోటు షికారు చేశారు. చిన్నారులు మినీ ట్రైన్ ఎక్కి ఆడుకున్నారు. స్కై సైకిల్ ఎక్కి ఆకాశంలో చక్కెర్లు కొట్టారు. జెయింట్ వీల్ ఎక్కి, ఉయ్యాల, జంపాల చేశారు. అనంతరం మెట్టుగూడ జలపాతాన్ని సందర్శించారు.

సిఎం దృష్టికి మండల సమస్యలు

ప్రజాశక్తి - కొమరాడ

ఈనెల 28న కురుపాం విచ్చేయనున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దృష్టికి మండలంలోని ముఖ్యమైన సమస్యలు తీసుకెళ్లనున్నట్టు సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి తెలిపారు. ఈ మేరకు ఆదివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. ప్రధానంగా పూర్ణపాడు-లాబేసు వంతెన పనులు 14ఏళ్లయినా పూర్తి కాలేదని, దీనివల్ల 60 గ్రామాల గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కావున వెంటనే ఈ వంతెనను పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే గత ఆరేళ్లుగా మండలంలో ఏనుగులు స్వైరవిహారం చేస్తున్నాయని, వీటి బారినపడి ఇప్పటి వరకూ 11మంది చనిపోగా, రూ.4కోట్ల వరకు ఆస్తినష్టం జరిగిందన్నారు. ఇటు ప్రాణనష్టం, అటు ఆస్తినష్టం వాటిల్లినందున వెంటనే నుగులను అడవికైనా, జూకైనా తరలించేందుకు చర్యతీసుకోవాలని కోరారు. అలాగే గుమ్మిడిగెడ్డపై మినీ రిజర్వాయర్ నిర్మాణం, జంఝావతి రిజర్వాయర్ పూర్తి చేయాలని కోరనున్నట్టు తెలిపారు. జిల్లా కేంద్రానికి, మండల కేంద్రానికి రాకపోకలకు తీవ్ర ఆటంకంగా ఉన్న రైల్వే గేట్లు వద్ద ఫ్లఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిని ఇవ్వనున్నట్టు తెలిపారు. విలేకరుల సమావేశంలో ప్రజాసంఘాల నాయకులు ఎ.ఉపేంద్ర, రెడ్డి శివున్నాయుడు గిరిజన సంఘం నాయకులు ఈ లక్ష్మం పాల్గొన్నారు.

టిడిపి మేనిఫెస్టో పై గిరిజన గ్రామాల్లో ప్రచారం

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

మండలంలోని బుదురువాడ పంచాయతీ బిత్తరతోంకి, టేకులోవ, సంఘందొరవలస గిరిజన గ్రామాల్లో ఆదివారం టిడిపి అరకు పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు గొట్టాపు వెంకట నాయుడు పర్యటించి ఇటీవల మహానాడులో చంద్రబాబు ప్రకటించిన ప్రీ మేనిఫెస్టోపై గిరిజనులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019లో చంద్రబాబు అధికారంలోకి వస్తే రూ.3000 పింఛను ఇచ్చేవారని జగన్ రెడ్డి పాలనలో నేటికీ రూ.2750 మాత్రమే ఇస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

నేడు వాహనాల వేలం

ప్రజాశక్తి - సాలూరు

పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో సీజ్ చేసిన 17 వాహనాలను సోమవారం ఉదయం వేలంపాట నిర్వహించనున్నట్లు టౌన్ సిఐ సిహెచ్.శ్రీనివాసరావు తెలిపారు. ఇందులో రెండు టాటా ఎసి, రెండు టాటా మేజిక్, రెండు ఆటోలు, 11మోటారు సైకిళ్లను వేలం వేయనున్నట్లు చెప్పారు. ఆసక్తి కలిగిన వ్యక్తులు ఈ వేలంపాట లో పాల్గొని వాహనాలను పొందవచ్చునని ఆయన తెలిపారు.

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక హనుమాన్ జంక్షన్ వద్ద ఆదివారం ఎస్సై కె.నీలకంఠ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు ప్రభుత్వ నిబంధన ప్రకారం హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని అన్నారు. మైనర్ బాలికలకు వాహనాలు ఇవ్వరాదన్నారు. ప్రభుత్వ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించి వాహనాలు నడపలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

నిధులలేమితో

నత్తనడకన నాడు-నేడు పనులు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించి నాడు-నేడు పనులకు సకాలంలో నిధులు విడుదల చేయకపోవడంతో నత్తనడకన నడుస్తున్నాయి. మరో వైపు ఇసుక, ఇతర సామాగ్రి సకాలంలో అందకపోవడం కూడా మరోకారణం. దీనికి తోడు సామగ్రి కొనుగోలులో ఉపాధ్యాయులు ఏ సామాగ్రి కొనుగోలు చేయాలి, ప్రభుత్వం ఏ సామాగ్రి పంపిణీ చేస్తుందన్న విషయం అధికారులు కొంతకాలం స్పష్టత ఇవ్వలేదు. దీంతో నాడు- నేడు పనులు నేటికీ మందకొడిగానే సాగుతున్నాయి. పాఠశాలలు ప్రారంభించి 10రోజులు కావస్తుండగా అసౌకర్యాల మధ్య విద్యార్థులు చదువులను కొనసాగిస్తున్నారు.

మండలంలోని మునక్కాయవలస, డోకిశిల, టేకిలోవ, గిరిజన సంక్షేమ శాఖకు చెందిన జిపి స్కూల్స్, కవిటిభద్ర కెజిబివి, ఎమ్మార్‌నగరం, ఎన్‌ములగ, నరిసిపురం, తాళ్లబురిడి, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలల్లోనూ, ఎమ్మార్‌నగరం, ఆడారు, బొడ్డవలస, చినమరికి, డికెపట్నం, కారాడవలస, కొత్తవూరు, ఎల్‌ఎన్‌పురం, లిడికివలస, మూడడ్లవలస, నరిసిపురం డిపెప్, నరిసిపురం, రావికోనబట్టివలస, తాళ్లబురిడి, విఆర్‌పేట, వెలగవలస, జమదాల, పుట్టూరు, పెదబొండపల్లి సూడిగాం ఎంపిపి పాఠశాలల్లో సుమారు రూ.40కోట్ల విలువైన పనులు జరగాల్సి ఉండగా, అన్ని చోట్లా కేవలం 25శాతం పనులే పూర్తయ్యాయి. చిత్రమేమిటంటే వీటిల్లో కొన్ని ప్రభుత్వం తీసుకున్న 3,4,5 తరగతులు దగ్గరలోని హైస్కూల్స్‌లో విలీనం చేయడం వల్ల పాఠశాలలో పనులు జరిగినా, అందుకు సరిపడా విద్యార్థులు లేని పరిస్థితి. పనుల జాప్యంపై పాఠశాల నిర్వహణ కమిటీ, ప్రధానోపాధ్యాయులను అడగ్గా, ఇసుక కొరత, మెటీరియల్ కొంత ప్రభుత్వం సరఫరా, కొంతతాము కొనుగోలు చేయాల్సి ఉండగా, ఏది తాము కొనాలో, ఏది ప్రభుత్వం సరఫరా చేస్తుందో తెలియని గందరగోళంతో ఉన్నట్టు తెలిపారు. మండలంతో పాటు పట్టణంలోని పాఠశాలల పర్యవేక్షణకు ఐటిడిఎకు చెందిన ఇంజనీరు ఒకరే కావడంతో పర్యవేక్షణా లోపం కూడా దీనికి తోడయ్యింది. పాఠశాలలు ఈనెల 12 నుంచి ప్రారంభమవ్వగా, అరకొర పనులతో, చిందరవందరగా ఉన్న తరగతి గదులతో, అసంపూర్ణంగా ఉన్న గచ్చులతో విద్యార్థుల అభ్యాసన కొనసాగిస్తున్నారు. తీవ్రం ప్రభావం తమ పిల్లలపై పడుతుందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యాశాఖ అధికారులు స్పందించి, పూర్తిస్థాయిలో నిధులు విడుదల చేసి, పనులను పరుగులెత్తించి, ఈనెలాఖారుకు అన్ని సౌకర్యాలతో తరగతిగదులు, మరుగుదొడ్లు అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు.

కొరవడిన పర్యవేక్షణ
పనులపై స్పష్టత ఇవ్వని అధికారులు

అర్ధాంతరంగా నిలిచిపోయిన మరుగుదొడ్ల నిర్మాణం

ఎంఆర్ ఎంపిపి స్కూల్‌లో గచ్చులో పూర్తికాని తరగతి గది

మెటీరియల్ కొరతతో పనులు జాప్యం

కరెంటు వైరింగ్ పనులు పూర్తి చేశాం. పనులు ప్రారంభమైన తొలుత ఇసుక కొరతవలన జాప్యం జరిగినమాట వాస్తవమే. అయినప్పటికీ ఆ తర్వాత గచ్చులు గ్రానైట్‌తో వేయాలో, టైల్స్‌తో వేయాలో అన్న విషయంపై స్పష్టత లోపించింది. అధికారులు ఇటీవల స్పష్టత కల్పించడంతో పనులు వేగవంతం చేస్తున్నాం.

పి.రాజగోవిందమ్మ,
హెచ్‌ఎం, ఎమ్మార్‌నగరం, ఎంపిపిస్కూల్

నిధుల లేమే జాప్యానికి ప్రధానం కారణం



పాఠశాలలో పనులు సకాలంలో ప్రారంభించాం. మరుగుదొడ్లకు శ్లాబు పనులు నిర్వహించాల్సి ఉంది. నిధులు సకాలంలో విడుదలకాకపోవడమే ఆలస్యానికి ప్రధానం కారణం.

కొండూరు సురేష్, చైర్మన్, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ,
ఎమ్మార్‌నగరం, ఎంపిపి స్కూల్

ఉద్యోగ జీవితం సంతృప్తినిచ్చింది

జిసిసి అకౌంటెంట్ డి.సూర్యనారాయణ

ప్రజాశక్తి - సాలూరు

గిరిజన సహకార సంస్థ (జిసిసి)లో ఉద్యోగ జీవితం సంతృప్తి నిచ్చిందని సాలూరు జిసిసి బ్రాంచ్ అకౌంటెంట్ దాసరి సూర్యనారాయణ చెప్పారు. ఈనెలాఖరున ఉద్యోగ విరమణ చేయనున్న సూర్యనారాయణ తన ఉద్యోగ ప్రస్థానం గురించి 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. ఆయన మాటల్లోనే...

మా సొంతూరు మక్కువ మండలం వెంకటభైరిపురం. తండ్రి లక్ష్మ, తల్లి ఎర్రమ్మ. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు సొంత ఊరులో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుకున్నాను. ఆరు నుంచి పదోతరగతి వరకు తాతగారి ఊరు తాళ్లబురిడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదివాను. ఆ తర్వాత బొబ్బిలి ఐటిఐలో ఫిట్టర్ పూర్తి చేశాను. 1986లో జిసిసిలో సేల్స్‌మాన్‌గా నా ఉద్యోగ ప్రస్తానం గుమ్మలక్ష్మీపురం మండలం ఇరిడిలో ప్రారంభించాను. 1987లో సాలూరు జిసిసి బ్రాంచ్‌కి బదిలీ అయ్యాను. సాలూరు మండలం మావుడి, తాడిలోవ, మక్కువ మండలం నంద, పాచిపెంట మండలం కేసలి, పద్మాపురం, రొడ్డవలస, కోష్టువలస, పూడి గ్రామాల్లో పని చేశాను. తొమ్మిదేళ్ళు సాలూరు ప్రాంతంలో పని చేశాను. 2011లో శాండీ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగోన్నతి లభించింది. పాడేరు జిల్లా చింతపల్లి జిసిసి బ్రాంచ్‌లో రెండేళ్ళ పాటు పని చేశాను. 2013లో పార్వతీపురం డివిజన్ పరిధిలో ఉన్న సాలూరు ఎంఎఫ్ గోడౌన్ ఇంఛార్జి చేరాను. ఆ తర్వాత సీనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగోన్నతి లభించింది. 2016లో అకౌంటెంట్‌గా చేరాను. 2022లో ఎంఎల్ఎస్ పాయింట్ ఇంఛార్జిగా ఆరునెలలు చేశాను. ఆ తర్వాత నుంచి అకౌంటెంట్‌గా కొనసాగుతున్నాను. ఉద్యోగ జీవితంలో చేదు అనుభవం 2000లో ఎదురైంది. సేల్స్ మాన్ గా విధులు నిర్వహించి ఇంటికి తిరిగి వస్తున్న సమయంలో మావుడి, నంద మధ్య కొంతమంది నకిలీ మావోయిస్టులు బెదిరించి నా వద్ద ఉన్న రూ.11వేలు లాక్కున్నారు. సంస్థలో పని చేస్తున్న కాలంలో అధికారులు, సహోద్యోగుల సహకారం చాలా సంతృప్తి నిచ్చింది. భార్య లక్ష్మీ గృహిణి. ఆమె ఇంటర్ చదివారు. ఇద్దరు అమ్మాయిలు. పెద్ద కుమార్తె లక్ష్మీకి వివాహమైంది. చిన్న కుమార్తె జాహ్నవి ఇంటర్ తర్వాత నీట్ కోచింగ్‌లో ఉంది. కుమారుడు జగదీష్ దివ్యాంగుడు ఇంటి వద్దనే వుంటున్నాడు. ఉద్యోగ నిర్వహణలో భార్య లక్ష్మి సహకారం మరువలేనిది. గిరిజన సంక్షేమమే ధ్యేయంగా ఏర్పడిన జిసిసిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బలోపేతం చేయాలి.

37ఏళ్ల ఉద్యోగ ప్రస్థానం సంతృప్తికరం

జిసిసి ఎంఎఫ్ఎ సెంట్రల్ గోడౌన్ ఇన్‌ఛార్జి కృష్ణమూర్తి

ప్రజాశక్తి - సాలూరు

గిరిజన సహకార సంస్థలో 37ఏళ్ల ఉద్యోగ ప్రస్థానం సంతృప్తికరంగా సాగిందని విశాఖ జిల్లా వేములవలసలో గల జిసిసి ఎంఎఫ్ఎ సెంట్రల్ గోడౌన్ ఇంఛార్జి యడ్ల కృష్ణమూర్తి చెప్పారు. ఈనెలాఖరున ఉద్యోగ విరమణ చేయనున్న కృష్ణమూర్తి తన ఉద్యోగ జీవితం గురించి ప్రజాశక్తి తో ముచ్చటించారు.వివరాలు ఆయన మాటల్లోనే...

మాది పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరం మండలంలోని అప్పయ్యపేట. తండ్రి అప్పలస్వామి, తల్లి సోములమ్మ. మాది వ్యవసాయ కుటుంబం. నా విద్యాభ్యాసం ఒకటి నుంచి ఐదు వరకు సీతానగరం ప్రభుత్వ పాఠశాలలోనూ, ఆరు నుంచి పదోతరగతి వరకు పార్వతీపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోనూ, ఇంటర్మీడియట్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పూర్తి చేశాను. 1986 నవంబర్ 1న జిసిసిలో సేల్స్ మాన్‌గా సాలూరు బ్రాంచ్ పరిధిలోని పద్మాపురంలో ఉద్యోగం ప్రారంభించాను. పాచిపెంట మండలం పద్మాపురం, మాతుమూరులో 25ఏళ్లు పని చేశాను. 2009లో జూనియర్ అసిస్టెంట్‌గా, 2013లో సీనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగోన్నతి లభించింది. 2011లో చింతపల్లి జిసిసి బ్రాంచ్ లో రెండేళ్ళ సీనియర్ అసిస్టెంట్ గా చేశాను. 2016లో పార్వతీపురం డివిజన్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ గా చేరి 2020వరకు పని చేశాను. 2020డిసెంబర్‌లో పార్వతీపురం బ్రాంచ్ మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టి 2022 జూన్ వరకు చేశాను. 2022జూలై నుంచి విశాఖ జిల్లా వేములవలసలో ఉన్న ఎంఎఫ్ఎ సెంట్రల్ గోడౌన్ ఇంఛార్జిగా పని చేస్తున్నాను. ఉద్యోగ ప్రస్థానంలో సంస్థ ఉన్నతాధికారులు, సహోద్యోగుల సహకారం బాగుంది.

మేం ఐదుగురు అన్నదమ్ములం. రెండో అన్నయ్య మల్లన్నదొర సుగర్ ఫ్యాక్టరీలో పనిచేశారు. పెద్దన్నయ్య మరణించారు. తమ్ముడు శంకరరావు కమర్షియల్ టాక్స్ ఆఫీస్‌లో పని చేస్తున్నారు. ఆఖరి తమ్ముడు సింహాచలం వ్యవసాయం చేస్తున్నారు. మరదలు రెవెన్యూ శాఖలో పని చేస్తున్నారు. భార్య జయలక్ష్మి గృహిణి. ముగ్గురు పిల్లలు. కుమార్తె కుమారి పాంచాలి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నారు. అల్లుడు పాపారావు పి.కోనవలస గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలలో కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్‌గా పని చేస్తున్నారు. పెద్దబ్బాయి రమేష్ సాలూరు మండలం కొత్తవలస సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. చిన్నబ్బాయి వెంకటేష్ డిగ్రీ పూర్తి చేసి ఉద్యోగ అన్వేషణలో వున్నారు. ఉద్యోగ విధి నిర్వహణలో భార్య జయలక్ష్మి సహకారం మరువలేనిది. జిసిసిలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలు చేపట్టి సంస్థ బలోపేతానికి ప్రభుత్వం చొరవ చూపాలి.

కొత్తూరులో నిరసన తెలుపుతున్న గిరిజనులు

బోయ, వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చొద్దు

ప్రజాశక్తి - సాలూరురూరల్

బోయ వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేర్చొద్దని గిరిజన సంఘం ఆదివారం సారిక పంచాయతీ కొత్తూరులో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం మండల నాయకులు చింత జోగయ్య, గెమ్మెల బోడమ్మ మాట్లాడుతూ బోయ వాల్మీకి, బెంతు ఒరియాలను రాష్ట్ర ప్రభుత్వం గిరిజన జాబితాలో చేర్చేందుకు తీర్మానం చేసిందని, అసలు అన్ని కులాలు కంటే ముందుగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పరంగా ఎంతో అభివృద్ధి చెంది బిసి జాబితాలో వున్న ఈ కులాలను ఇప్పుడు ఎస్‌టి జాబితాలో చేర్చాలనుకోవడం దారుణమన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి ఇప్పటి వరకు ఇంకా వెనుకబడి ఉన్న గిరిజన జాతుల బిడ్డలు ఉద్యోగ, ఉపాధికి ఇంకా మరొక వందేళ్లు వెనక బడిపోతారాని, ఇంకా ప్రభుత్వాలు తమకు రాజ్యాంగం కల్పించిన హక్కులను హరిస్తుంటే గిరిజనులు చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఈ విషయమై ఈనెల 28న పార్వతీపురం ఐటిడిఎ వద్ద జరిగే నిరసన, ధర్నా కార్యక్రమంలో జిల్లాలోని గిరిజనులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహకార్యదర్శి మర్రి శ్రీనివాస రావు, మండల కమిటీ సభ్యులు చింత లక్ష్మి, సుకూరు గంగయ్య, మురళి, కన్నయ్య పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్తు ఛార్జీలను తగ్గించాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలు వెంటనే తగ్గించాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. ఆదివారం విద్యుత్ బిల్లులు చెల్లింపు కేంద్రం వద్ద వినియోగదారులతో కలిసి నిరశన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నడూ లేనివిధంగా ప్రభుత్వం విద్యుత్ బిల్లులు పెంచి వినియోగ దారులపై భారం మోపడం దారుణమన్నారు. గతంలో 200, 300 బిల్లులు వచ్చిన వారికి ఇప్పుడు రూ. 500 నుంచి 1000 రూపాయల వరకు బిల్లులు రావడం అన్యాయమన్నారు. ప్రభుత్వం అదనపు చార్జీల పేరిట వినియోగదారుల పై మోయరాని భారం మోపి ఆర్థికంగా ఇబ్బందులకు గురి చేయడం భావ్యం కాదన్నారు. పురిగుడెసి వినియోగదార్లకు 200 యూనిట్లు వరకూ ఉచితంగా ఇస్తామని ఇవ్వడం లేదన్నారు. గతంలో సంవత్సరానికి, రెండు సంవత్సరాలకు ఒకసారి విద్యుత్ ఛార్జీలు పెంచే వారని ప్రస్తుతం ప్రతీ నెలా పెంచుకుంటూ పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని ఈనెల30న ఆందోళన చేస్తామని ప్రజలు సహకరించాలని కోరారు.

ఉత్సాహంగా ఒలింపిక్ డే రన్

విజయనగరం టౌన్: నగరంలో ఒలింపిక్ సంఘం ఆధ్వర్యంలో ఒలింపిక్ డే రన్ ఉత్సాహంగా జరిగింది. ఒలింపిక్ దినోత్సవం సందర్భంగా స్థానిక రాజీవ్ స్టేడియం నుంచి కోట వరకు ఈ రన్ నిర్వహించారు. పెద్దఎత్తున యువత , క్రీడాకారులు పరుగులో పాల్గొన్నారు. పరుగులో పాల్గొన్న వారికి నిర్వాహకులు టీషర్టులు, టోపీలు అందజేశారు. ఒలింపిక్ జ్యోతిని ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ వెలిగించి, జెండా ఊపి పరుగును ప్రారంభించారు. అనంతరం సీనియర్ క్రీడాకారులను, వ్యాయామ ఉపాధ్యాయులను, జాతీయ క్రీడల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను సత్కరించారు. ఈ సందర్భంగా రఘువర్మ మాట్లాడుతూ క్రీడాకారులలో సమానత్వం కలిగించి, క్రీడా స్ఫూర్తిని నింపాలనే ఉద్దేశంతో ఒలింపిక్‌డే రన్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈ క్రింది నెంబర్‌కు ఫోన్ చేయగలరు.
పార్వతీపురం జిల్లా సర్క్యులేషన్ ఎగ్జిక్యూటివ్
యస్. నాగేశ్వరరావు : 94900 99319

వైసిపి పాలనలో ప్రజలకు భరోసా ఏదీ : టిడిపి

ప్రజాశక్తి - సాలూరురూరల్

సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సంధ్యారాణి

వైసిపి ప్రభుత్వంలో ప్రజల భవిష్యత్‌కు భరోసా ఎక్కడ ఉందని టిడిపి సాలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుమ్మడి సంధ్యారాణి ప్రశ్నించారు. ఆదివారం ఆమె స్వగృహంలో నియోజకవర్గ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడారు. మహానాడులో టిడిపి ప్రవేశపెట్టిన మేనిఫెస్టోను ప్రజలకు వివరించడానికి చేపట్టిన బస్ యాత్ర మొదటి విడత అనకాపల్లి జిల్లా పాయకరావు పేట, నర్సీపట్నం నియోజకవర్గంలో విజయవంతంగా జరిగిందని,ఈ యాత్రకు ప్రజలు బ్రహ్మ రథం పట్టరాని అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలు, నిరసనలపై వివరించామన్నారు. 98 శాతం హామీలు అమలు చేశామని చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ఈ నాలుగేళ్ల సామాన్యులపై విద్యుత్ ఛార్జీలు 8సార్లు పెంచారని, నిత్యవసరాల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని అన్నారు. అలాగే అభివృద్ధి చేశానని చెప్పుకుంటున్న సిఎం రాజధాని లేకుండా చేశావని, పోలవరాన్ని ముంచేశావని, విశాఖ రైల్వే జోన్, గిరిజన యూనివర్సిటీ ఎక్కడని ప్రశ్నించారు. సిపిఎస్ రద్దు, జాబ్ క్యాలెండర్ ఏదని ప్రశ్నించారు. సామాన్యులను నిండా ముంచి వారికి భవిష్యత్ లేకుండా రూ.పది లక్షల కోట్లు అప్పులు చేసి మీ జాబ్ నింపుకున్నారే తప్ప పేద ప్రజలకు మీరు చేసిందేమీ లేదని ధ్వజమెత్తారు. ఎప్పుడు ఎన్నికలు వస్తాయానని ప్రజలు మీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. సమావేశంలో సాలూరు పట్టణ అధ్యక్షుడు నిమ్మాది చిట్టి, పాచిపెంట మండల అధ్యక్షులు ముఖి సూర్యనారాయణ, నాయకులు కూనిశెట్టి భీమారావు, పప్పల మోహన్, డబ్బి కష్ణ, కన్నబాబు, అప్పారావు, గంగరాజు, బాలాజీ, భాస్కర్, శ్రీను పాల్గొన్నారు.

సామూహికంగా బీజామృతం తయారీ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

బీజామృతం తయారీని పరిశీలిస్తున్న ప్రకృతి వ్యవసాయం కోఆర్డినేటర్ భూషణరావు

మండలంలోని జెకె పాడులో సామూహికంగా గిరిజన రైతులంతా బీజామృతంతో విత్తన శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆవు పేడ, మూత్రం, తెల్ల సున్నం, పుట్టమన్నుతో బీజామృతం తయారు చేశారు. ప్రకృతి వ్యవసాయం కోఆర్డినేటర్ భూషణరావు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో రైతులంతా చిరుధాన్యాలు, ఆహార ధాన్యాలు, పప్పు దినుసులు అన్ని రకాల విత్తనాలు ఈ బీజామృతంలో విత్తని శుద్ధి చేసుకోవాలని సూచించారు. బీజామృతంలో శుద్ధి చేసిన విత్తనాలన్నీ 90శాతం మొలకేత్తే సామర్థ్యం పెంచుతుందన్నారు. నేలలో ఉండే హానికరమైన సూక్ష్మజీవులను అంతం చేస్తాయని అన్నారు. బీజామృతం వల్ల మొలక శాతం బాగా పెరిగి విత్తనంలో, భూమిలో ఉండే చీడ, పీడలకు ఎటువంటి వైరస్ రాకుండా బీజామృతం ద్వారా శుద్ధి చేసిన విత్తనాలను కాపాడుకోవచ్చు అన్నారు. ఎటువంటి హానికరం లేని పంటలను దిగుబడి చేసుకోవచ్చని రైతులకు సూచించారు. ప్రతి గ్రామంలో ప్రతి రైతు బీజామృతం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం సభ్యులు మహేష్, పూర్ణ, శారద తదితరులు ఉన్నారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు

సీతానగరం : సేంద్రియ ఎరువులతో రైతులకు అధిక దిగుబడి వస్తాయని వ్యవసాయ శాఖ ఎఒ ఎస్.అవినాష్ అన్నారు. మండలంలోని సీతారాంపురంలో సేంద్రియ ఎరువులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తక్కువ పెట్టుబడితో అధిక ఉత్పత్తి సాధించి లాభం పొందచ్చన్నారు. భూసారాన్ని కోల్పోకుండా ఉండేందుకు సేంద్రియ ఎరువులు వాడాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని భార్యాభర్తలకు గాయాలు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలోని వెంకంపేట పంచాయితీ గృహలక్ష్మీనగర్‌కు చెందిన అప్పలనాయుడు, సరోజినీ అనే ఉపాధ్యాయ దంపతులు ఆదివారం తమ ద్విచక్ర వాహనంపై పార్వతీపురం పట్టణంలోకి సొంత పనుల నిమిత్తం వెళ్తుండగా, పట్టణంలోని గాంధీ సత్రం కూడలిలో వెనుక నుంచి వేరొక బైక్ ఢీకొనడంతో ఇరువురికి గాయాలయ్యాయి. స్పందించిన స్థానికులు జిల్లా ఆసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఔట్‌పోస్ట్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేరాలు ఘోరాలు

చెట్టు నేలకొరిగి యువతికి గాయాలు

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని కిరపకు చెందిన కూరంగి వసుద వంట చేస్తుండగా అప్పుడే కురిసిన వర్షానికి చెట్టు నేలకొరిగి నడుం మీద పడటంతో నడుముకి బలమైన గాయమైంది. బంధువులు సీతంపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. వసుధ స్థానికప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతుంది . శ్రీకాకుళం జిల్లా హిరమండలం మండలం కరిడికి చెందిన వసుధ సీతంపేట మండలం కిరపలో తన చిన్ననాన్న వద్ద చదువుకుంటుంది.